బ్రహ్మోత్సవాలకు వేళాయె!



విద్యుద్దీపాల వెలుగుల్లో వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం

- భక్తాభీష్ట వరదుడు శ్రీవేంకటేశ్వరుడు
- చిన్నతిరుపతిగా విలసిల్లుతున్న వైకుంఠపురం దేవస్థానం
- నేటి నుంచి ఏడురోజులపాటు జరగనున్న బ్రహ్మోత్సవాలు

తెనాలి: తెనాలిలోని వైకుంఠపురం దేవస్థానం. ఎత్తయిన ఏడుకొండలవాని తిరుమల నిలయానికి ప్రతిరూపంగా 'చిన్న తిరుపతి'గా విరాజిల్లుతోంది. పట్టణానికి దక్షిణంగా ప్రశాంత వాతావరణంలో ఉందీ ఆలయం. నిత్యకల్యాణం.. పచ్చతోరణంగా సేవలందుకుంటున్న కలియుగ నాయకుడు శ్రీవేంకటేశ్వరుడు, లక్ష్మీపద్మావతి సమేతంగా భక్తాభీష్ట వరదుడై పరమ ప్రసన్న శోభను చిందిస్తూ, బహుముఖ వైభవోపేతుడై వెలుగొందుతున్నాడు. వేలాదిమంది భక్తులు, దాతల వితరణ, పాలకవర్గాల కృషితో పవిత్ర యాత్రాస్థలంగా శోభిల్లుతోంది. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కుంభా సాయిబాబుగౌడ్, సభ్యులు ఆలయ అధికారుల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి జరగనున్నాయి.

ఏడురోజుల ఉత్సవ సంరంభం...

ఏటా వైభవోపేతంగా జరిగే వైకుంఠపురవాసుని బ్రహ్మోత్సవాలు గతేడాది ఎన్నికల కోడ్ కారణంగా



స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలు

ఆడంబరాలకు పోకుండా సంప్రదాయం ప్రకారం నిర్వహించారు. ప్రస్తుతం ఎలాంటి అధికారిక ఆంక్షలు లేనందున అంగరంగ వైభవంగా ఉత్సవాల నిర్వహణకు సన్నాహాలు చేశారు. తొలిరోజు ఉదయం 11 గంటలకు శ్రీస్వామివారిని పెండ్లికుమారుని చేయటతో ఉత్సవ సంరంభాన్ని ఆరంభిస్తారు. రాత్రి ఏడు గంటలకు అంకురారోపణ, ధ్వజారోహణ చేస్తారు. ఏడురోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం నిత్యహోమం, ఆలయ బలిహరణ ఉంటాయి. 16న సాయంత్రం 6.30 గంటలకు శేషవాహనం గ్రామోత్సవాన్ని నిర్వహిస్తారు. 17న సాయంత్రం గజవాహనం



ఆలయం లోపలి భాగం

గ్రామోత్సవం, 18 సాయంత్రం ఎదురుకోల ఉత్సవం, రాత్రి ఏడు గంటలకు శ్రీస్వామివారి కళ్యాణ మహోత్సవం ఉంటాయి. 19న ఉదయం 8 గంటలకు గరుడోత్సవం, గ్రామోత్సవం, సాయంత్రం 6 గంటలకు దివ్యరథోత్సవం, గ్రామోత్సవం ఉంటాయి. 20న ఉదయం వసంతోత్సవం, శ్రీచక్రస్నానం, రాత్రి ఏడున్నరకు ధ్వజావరోహణం, పూర్ణాహుతి నిర్వహిస్తారు. చివరిరోజైన 21న రాత్రి ఏడుగంటలకు ద్వాదశ ప్రదక్షణములు, 8.30కు ఏకాంతసేవ జరుపుతారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు, సాయంత్రం ఆరు గంటలకు ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేశారు.

తిరుమల తరహాలో ...

వైకుంఠపురం దేవస్థానం సంస్థాపకుడు తెనాలికి చెందిన తుళ్లూరు బాలనరసింహారావుగౌడ్ 1961లో ఇక్కడ స్థలం అభివృద్ధి చేసి భక్తుల సహకారంతో 1972లో ఆగమ శాస్త్రానుసారంగా, దేవాలయ నిర్మాణం పూర్తిచేసి, విగ్రహ ప్రతిష్ఠ చేశారు. భక్తుల ఆదరణతో ఆ మరుసటి ఏడాది అంటే 1973లో ఆలయం దేవదాయశాఖ పరిధిలోకి వెళ్లింది. ఏటికేడాది భక్తుల సంఖ్య పెరుగుతూ కోరిన కోర్కెలు తీరుస్తున్న ఇలవేల్పుగా, భక్తుల కొంగుబంగారంగా శ్రీవేంకటేశ్వరుడు ఇక్కడ పూజలు అందుకుంటున్నాడు. భక్తుల సంఖ్య, ఆలయ ఆదాయం ఏటేటా వర్ధిల్లింది. ఆలయ కార్యనిర్వహణాధికారి నుంచి 1999లో సహాయ కమిషనర్ హోదా లభించింది. నిత్యపూజలతోపాటు ప్రతి శుక్ర, శనివారాల్లో ప్రత్యేక పూజలు జరిగే ఆలయంలో ఏటా వైశాఖ మాసం నుంచి బహుళ పాడ్యమి వరకు బ్రహ్మోత్సవాలను కమనీయంగా నిర్వహిస్తున్నారు. పుష్యమాసంలో వైకుంఠ ఏకాదశి, ఉత్తర ద్వారదర్శనం, సంక్రాంతికి తెప్పోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నారు. తిరుమల తరహాలో పుష్పయాగం, పవిత్రోత్సవాలను 16 ఏళ్లక్రితమే ప్రారంభించారు. నిత్యాన్నదాన పథకం ఇక్కడ అమలవుతోంది.

గత ప్రభుత్వంలో సప్తవాహన సేవలు

గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో హనుమాన్ సేవకుడు వుప్పల వరదరాజులు అధ్యక్షతన ఏర్పాటైన ట్రస్టుబోర్డు ఆధ్వర్యంలో భక్తులను విశేషంగా ఆకర్షించారు. ఆలయ చరిత్రలో తొలిసారిగా రథసప్తమికి తిరుమల తరహాలో సూర్యోదయం నుంచి చంద్రోదయం వరకు సప్తవాహన సేవలు, గ్రామోత్సవాన్ని ఆరంభించారు. సంగీత మంటపాన్ని నిర్మించారు. బ్రహ్మోత్సవాల తర్వాత స్వామివారి శ్రీచక్ర స్నానానికి వీలుగా కోనేరు నిర్మించారు. భక్తుల సంఖ్య పెరగటంతో హుండీ ఆదాయం రెట్టింపయింది.

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం



వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఏడురోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాలకు సన్నాహాలు పూర్తిచేశాం. ప్రతిరోజూ ఆలయంలో జరగాల్సిన ఉత్సవ కార్యక్రమాలు, గ్రామోత్సవాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నాం. భక్తులు పెద్దసంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరుతున్నాం.

– మంతెన అనుపమ, ఆలయ సహాయ కమిషనర్

పేదలకు వైద్యసేవలు అభినందనీయం



తెనాలి టౌన్: పేద ప్రజలకు వైద్య సేవలు చేరువచేయడం అభినందనీయమని ఫాదర్ మిల్కియర్ రాజ్ అన్నారు. రూరల్ గ్రామం కొలకలూరు జూబ్లీ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఆవరణలో బుధవారం ఆశ్రయం హ్యాండ్ హోప్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని రెవరెండ్ ఫాదర్ మిల్కియర్ రాజ్ ప్రారంభించారు. షుగర్, బీపీ, మోకాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, ఆయాసం, కంటి, దంత సంబంధిత రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఈసీజీ, ఎక్స్‌రే, రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో డాక్టర్ భరత్, మనోజ్ఞ, స్వాతి, సనదుర్గ, సంపత్ వైద్యసేవలు అందదించారు. ఫౌండర్ రంజీత్ కుమార్ మాట్లాడుతూ 16 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అఖిల్, ఎస్.మురళి, స్వామి, కుసుమ, శామ్యూల్, సాలోమాన్, రవి, శ్యామ్ పాల్గొన్నారు.

'చావా' శంభాజీ మహరాజ్ జయంతి



తెనాలి: హిందూ చైతన్య వేదిక, మరాఠా యువక మండల్ ఆధ్వర్యంలో బుధవారం 'చావా' శంభాజీ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీచౌక్‌లో శంభాజీ మహరాజ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. బతికితే శివాజీలా బతకాలి.. మరణిస్తే శంభాజీలా మరణించాలని వక్తలు అభిప్రాయపడ్డారు. ఎన్ని ప్రలోభాలు పెట్టినా, ఎంతగా చిత్రహింసలు చేసినా హిందూ ధర్మం వదలి ఇస్లాంను స్వీకరించటానికి నిరాకరించిన శంభాజీ అందరికీ ఆదర్శమన్నారు. ఆర్ఎస్ఎస్ నగర కార్యదర్శి త్రిపురమల్లు హనుమత్‌ప్రసాద్, హిందూ చైతన్య వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు పొట్టిమూర్తి లక్ష్మీశ్రీనివాస్, వీహెచ్‌పీ నగర అధ్యక్షుడు రామాంజనేయులు, భజరంగ్‌దళ్ బాలాజీ, బట్టీ సుధాకర్, సంతోష్, మహేష్, వార్డు కౌన్సిలర్ విజయలక్ష్మి, రమాదేవి, తూనుగుంట్ల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

22న హనుమాన్ శోభాయాత్ర

తెనాలి: విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఈనెల 22న పట్టణంలో హనుమాన్ శోభాయాత్రను నిర్వహించనున్నారు. నిట్టా బాలు, నందికంటి రామాంజనేయులు పర్యవేక్షణలో జరిగే శోభాయాత్ర కరపత్రాన్ని బుధవారం సాయంత్రం ఆవిష్కరించారు. సుల్తానాబాద్‌లోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి బోసురోడ్డులోని చిట్టి ఆంజనేయస్వామి ఆలయం వరకు శోభాయాత్ర కొనసాగుతుందని తెలిపారు. జిల్లా సహ సంయోజక్ కారంపూడి రమాదేవి, సీతారామ కళ్యాణ దేవస్థానం అధ్యక్షురాలు వీర్లపాటి విజయలక్ష్మి, హిందూ ధార్మిక యువజన సంఘం అధ్యక్షుడు డీకే మారుతిశంకర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు



తెనాలిరూరల్: స్థానిక చెంచుపేటలోని ఇండోర్ స్టేడియం క్రీడాకారులకు పట్టణ స్థాయిలో బుధవారం షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో బాలబాలికలకు నిర్వహించిన పోటీలలో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నట్లు కోచ్ ఎస్. వినయ్‌కుమార్ తెలిపారు. పోటీలలో సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో విన్నర్స్‌గా దర్శిక్-భార్గవ్, రన్నర్స్‌గా సందీప్-ప్రణీత్ నిలిచారు. అలాగే జూనియర్స్ బాలుర విభాగంలో జిషన్ బేగ్-అభిషేక్ విన్నర్స్‌గా, వంశీధర్-కార్తీక్ రనర్స్‌గా నిలిచారు. సీనియర్స్ బాలుర విభాగంలో విన్నర్స్‌గా జ్యోతిష్-విజయ్ కృష్ణ, రన్నర్స్‌గా సత్య-లాస్విత్ గెలుపొందారు. జూనియర్స్ బాలికల విభాగంలో విన్నర్స్‌గా నిత్య-తేజస్వి, రన్నర్స్‌గా భావన-రోష్మిత, సీనియర్స్ విభాగంలో విన్నర్స్‌గా దుహిత-ఉషశ్రీ, రన్నర్స్‌గా టిమ్సి-సాత్విక గెలుపొందారు. విజేతలకు బహుమతి ప్రదాన కార్యక్రమంలో ఎం. రవిశంకర్, సాయిలలిత, హ్యాండ్ బాల్ కోచ్ నాగరాజు, బోస్, సాయికృష్ణ, రాము, సాయి చరణ్, శ్రీమన్నారాయణ, విజ్ఞాన్, అనురూప్, నోయల్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మె

మంగళగిరి: మంగళగిరి ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి బి.నాగేశ్వరరావును చట్టవిరుద్ధంగా సస్పెండ్ చేయడంపై యూనియన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ యాజమాన్యం నాగేశ్వరరావును వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన సస్పెండ్‌ను నిరసిస్తూ బుధవారం ఆర్టీసీ డిపో వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. నాగేశ్వరరావును యాజమాన్యం చట్టవిరుద్ధంగా సస్పెండ్ చేసి కక్ష్య పూరితంగా వ్యవహిస్తుందన్నారు. ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. యాజమాన్యం చొరవ చూపి సమస్యను పరిష్కరించాలని కోరారు. లేదంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు స్వామి, రత్నాకర్, సాంబశివరావు, చిన్ని సత్యనారాయణ, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేతనాలు పెంచాలి



ఫిరంగిపురం: ఉపాధి కూలీల వేతనం రోజుకు రూ.600 పెంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు అన్నారు. మండలంలోని గుండాలపాడు, బేతపూడి గ్రామాల్లో బుధవారం ఉపాధి కూలీలు పనిచేస్తున్న ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దేశవ్యాప్తంగా 20న కార్మిక సంఘాల పిలుపు మేరకు నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని అన్నారు. ఉపాధి కూలీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పనుల సమయంలో గాయాలపాలైన, మరణించినా వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి షేక్.మస్తాన్‌వలి, రైతు సంఘం నాయకులు జి.వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు నాగరాజులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ముగింపు సభ నేడు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం, అమరావతి ఐకాన్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ముగింపు సభను గురువారం నిర్వహిస్తున్నట్లు బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, అమరావతి ఐకాన్ అధ్యక్షులు వినోద్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం జరిగిగే ఈ ముగింపు కార్యక్రమానికి రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ప్రముఖులు పాల్గొంటారని అన్నారు. ఈ శిబిరంలో చిన్నారులు నేర్చుకున్న వివిధ రకాల నృత్యాలను ప్రదర్శిస్తారని వారు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

తెనాలి బస్టాండ్‌లో రూ.30లక్షలతో అభివృద్ధి పనులు

తెనాలి డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్

తెనాలిఅర్బన్: తెనాలి ఆర్టీసీ బస్టాండ్‌ను ఆధునికీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ పేర్కొన్నారు. డిపో ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాత బస్టాండ్ ఆవరణ పల్లంగా ఉండటం వలన వర్షం వచ్చిన సమయంలో నీరు నిలచి ప్రయాణికులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సహకారంతో రూ.30లక్షల నిధులతో దాని ఎత్తు పెంచే పనులు జరుగుతున్నాయన్నారు. అలాగే మరో రూ.50లక్షలతో అంతర్గత రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేసేందుకు ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపామన్నారు. అనుమతులు రాగానే వాటిని ప్రారంభిస్తామన్నారు.



మాట్లాడుతున్న డిపో మేనేజర్

వేసవిలో ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రక్షిత మంచినీటిని, ఆధునిక కుర్చీలు, ఫ్యాన్‌లు, లైట్లు వంటి వాటిని డిపో ఆవరణలో ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, అసిస్టెంట్ ఇంజినీర్ (మెకానికల్) అభిరామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో మురుగు తొలగింపునకు చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలో 15,16,17 వార్డుల్లో బుధవారం ఆమె పర్యటించారు. ఆ వార్డుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే మురుగు కాల్వల పూడికతీత పనులు పరిశీలించారు. పట్టణంలోని అన్ని కాల్వల పూడికతీత పనులు చేస్తున్నట్లు తెలిపారు. దీనివలన ఎక్కడ మురుగు నీరు నిల్వ ఉండే అవకాశం ఉండదన్నారు. ఆమె వెంట కౌన్సిలర్‌లు దివి



కాల్వలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్‌లు

అనిత, అన్నం పిన్నారావు, అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, ఆరోగ్యాధికారిణీ డాక్టర్ కె.హెలెన్ నిర్మల, టీపీఓ సాంబశివరావు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ప్రజారోగ్యానికి హాని కలిగిస్తే చర్యలు

మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల

తెనాలిఅర్బన్: ప్రజారోగ్యానికి ఎటువంటి హాని కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల సూచించారు. బోసురోడ్డు, మెయిన్ రోడ్డు, మార్కెట్ ఏరియాలలోని పలు స్వీట్స్ షాపులను ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాటిపై ఎటువంటి మూతలు పెట్టకపోవటంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. పదార్థాలపై ఈగలు వాలకూడదన్నారు. వీటివలన వ్యాధులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. వెంటనే వాటిపై మూతలు ఏర్పాటు



వ్యాపారులకు సూచనలిస్తున్న డాక్టర్ కె.హెలెన్ నిర్మల

చేయాలని ఆదేశించారు. ప్రజారోగ్యానికి హాని కలిగించినవారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆమె వెంట పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు ఉన్నారు.

కార్మికులకు నష్టపరిహారాన్ని చెల్లించాలి

తాడేపల్లి రూరల్: బ్రహ్మానందపురంలోని ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 162వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని సి.ఐ.టి.యు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు ప్రారంభించి మాట్లాడారు. తమకు న్యాయంగా రావాల్సిన నష్టపరిహారం కోసం కార్మికులు దీక్షలు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి కార్మికుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏసీసీ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి చూపడం సరికాదని అన్నారు. ఎన్నికల ముందు మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. యూనియన్ నాయకులు కూరపాటి స్టీవె



దీక్షలో పాల్గొన్న కార్మికులు

న్, శారద, రమాదేవి, లక్ష్మి రమ, శివమ్మ, గురవయ్య, సూర్య ప్రకాష్, నాగేశ్వరరావు, ఇస్మాయిల్, సాంబయ్య, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు

తెనాలిరూరల్: దాడి ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ మారిస్‌పేట శాంతినగర్ వద్ద మంగళవారం రాత్రి ఓ మహిళ మీదకు ఆటో వేగంగా దూసుకెళ్లింది. ఆమె వెంటనే పక్కకు తప్పుకోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. ఆమె భర్త భరత్ కలుగజేసుకుని ఆటో నడుపుతున్న వ్యక్తిని మందలించగా, అందులో ఉన్న సుమారు ఆరుగురు యువకులు అతనిపై దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు.

ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని వినతి



తాడేపల్లి రూరల్: ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని కోరుతూ తాడేపల్లిలోని ఇంటర్మీడియట్ విద్యామండలి కమిషనర్ కృత్తిక శుక్లాకు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.భాస్కర్, సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్‌లు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా ధనమే ధ్యేయంగా ఫీజుల దోపిడి జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా క్యాంపస్ ఒక జిల్లాలో ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా పీఆర్‌ఓలతో అడ్మిషన్లు చేస్తూ కార్పొరేట్ విద్యాసంస్థలు మాయమాటలతో చట్టవిరుద్ధంగా అడ్మిషన్లు చేస్తున్నారని విమర్శించారు. కమర్షియల్ బిల్డింగ్‌లో తరగతులను నిర్వహిస్తూ.. విద్యను వ్యాపారంగా మారుస్తున్నారని, కళాశాల ఆవరణలోనే పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు అంటూ వేలాది రూపాయలు దోపిడీ చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మహర్షి, సహాయ కార్యదర్శులు ఐ.రాజేష్, వీరేంద్ర ప్రసాద్, సభ్యులు ధీరజ్, శివ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి వైభవంగా చండీహోమం

దుగ్గిరాల: మండలంలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో కొలువైయున్న శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో 48వ పునఃప్రతిష్ఠ వార్షికోత్సవం జరగనుందని నిర్వాహకులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించారు. 17వ తేదీ నుంచి 21వ తేదీ వరకు వార్షికోత్సవం సందర్భంగా దేవస్థానంలో చండీహోమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కార్యనిర్వాహణ అధికారి కె.సునీల్‌కుమార్ కోరారు.



రవాణా రంగాన్ని దెబ్బకొట్టేలా కేంద్రం విధానాలు

- 20న దేశవ్యాప్త సమ్మెలో రవాణారంగ కార్మికులు పాల్గొనాలి
- కార్మికులకు సీఐటీయూ నాయకుల వినతి

తెనాలి: వ్యవసాయ రంగం తర్వాత కోట్లాదిమందికి జీవనోపాధి కల్పిస్తున్న రవాణా రంగాన్ని దెబ్బకొట్టే కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టేందుకు ఈనెల 20న జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో రవాణా రంగ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ, తెనాలి డివిజన్ కార్యదర్శి షేక్ హుస్సేన్ వలి కోరారు. సమ్మె ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి, ముద్దన సాంబశివరావుతో కలిసి పట్టణంలో పలుచోట్ల కరపత్రాలు పంచుతూ గ్రూపు సమావేశాలు నిర్వహించారు. ఆయా సమావేశాల్లో హుస్సేన్‌వలి మాట్లాడుతూ న్యాయ సంహిత చట్టం ద్వారా కొద్దిపాటి తప్పులకు కూడా భారీ జరిమానాల, జైలు శిక్షలు విధించటం దుర్మార్గమన్నారు. రవాణారంగాన్ని కాపాడుకునేందుకు మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో లారీ, మినీలారీ, ఆటోల డ్రైవర్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ముద్దన సాంబశివరావు మాట్లాడుతూ 20వ తేదీ ఉదయం 9 గంటలకు తెనాలి మున్సిపల్



రవాణారంగ కార్మికులతో మాట్లాడుతున్న హుస్సేన్‌వలి

కార్యాలయం నుంచి జరిగే ప్రదర్శనల్లో కార్మికులు పాల్గొనాలని కోరారు. శివసాంబిరెడ్డి తన ప్రసంగంలో, మోదీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని, ప్రభుత్వ రంగాన్ని ఇప్పుడు రవాణా రంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను రైతులు, కార్మికులు కలసి ఐక్యంగా తిప్పికొట్టాలని కోరారు. తొలుత వీఎస్సార్ కాలేజీ ఎదురుగా గల మినీ లారీస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్ గంగానమ్మపేట వంతెన వద్ద కార్మికుల్ని, మున్సిపల్ కార్యాలయం వద్ద, మెయిన్ రోడ్డు, మారిస్‌పేట, చెంచుపేటలో కార్మికుల్ని కలసి కరపత్రాలు పంచి వారితో మాట్లాడారు. కార్యక్రమాల్లో షేక్ కరీముల్లా, షేక్ మీరాఖాన్,ఎస్ కొండలు, షేక్ సుభాని, ఎస్.పిచ్చిరెడ్డి, షేక్ హసన్, షేక్ జిలాని, షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం

యర్రబాలెం(మంగళగిరి): మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెంలో కొలువైన శ్రీ భక్తాంజనేయ స్వామివారి విగ్రహ, జీవ, ధ్వజ, విమాన శిఖర ప్రతిష్ఠా మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకు విశ్వక్సేరాధనం, పుణ్యావాహం, ప్రాతస్సవనం, అధివాసాంగ హోమం, కుంభాబి మర్మనం, ఉక్త హోమాదులు, నివేదన, హారతి పూజలు, సాయం సవనం, కుంభాబి మర్మనం, మూలమన్త్ర హోమాదులు, సర్వ దైవత్య హోమం, మహిర్షి వేదన హారతి పూజలు నిర్వహించారు. పూజలు అనంతరం అన్నప్రసాదం వితరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలయ కమిటీ ప్రతినిధులు భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీభక్తాంజనేయ స్వామి

సిద్ధి వినాయకుడికి విశేష పూజలు



ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలో కొలువైయున్న జలపాలేశ్వస్వామి సన్నిధిలోని సిద్ధి వినాయకుడికి బుధవారం అర్చకులు ఉమాపతిశాస్త్రి విశేష పూజలు చేశారు. ఉదయాన్నే స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు చేసి నూతన వస్త్రాలతో అలంకరించారు. గరిక, పూలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు అర్చక స్వాములు తీర్థ ప్రసాదాలు అందజేశారు.